
దీపావళి
శుభాకాంక్షలు
పటాన్‌చెరు నియోజకవర్గ, తెల్లాపూర్
మున్సిపల్ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు,
అధికారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
దీపావళి శుభాకాంక్షలు
బాలగోని రాములు గౌడ్
మాజీ వైస్ చైర్మన్
తెల్లాపూర్ పురపాలక సంఘం
మాజీ జడ్పీటిసి-రామచంద్రాపురం
మండలం
బాలగోని సాయిచరణ్‌గౌడ్
బీఆర్ఎస్ యువజన నాయకులు
పటాన్‌చెరు నియోజకవర్గం

సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నిర్మలా జగ్గారెడ్డి

● దీపావళి శుభాకాంక్షలు తెలిపిన టీజీఐఐసీ చైర్‌పర్సన్

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన లైసెన్స్ సర్వేయర్లుగా శిక్షణ పొందిన అభ్యర్థులకు లైసెన్స్‌లు పంపిణీ కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నిర్మలా జగ్గారెడ్డి ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్ఛం అందజేసిన నిర్మలా జగ్గారెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.


సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నిర్మలాజగ్గారెడ్డి



లైసెన్స్ సర్వేయర్‌గా శిక్షణ పొందిన అభ్యర్థులకు లైసెన్స్‌లు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, నిర్మలాజగ్గారెడ్డి

ప్రజలకు సామాజిక చైతన్యం కలిగించడమే లక్ష్యం

● నాటక రూపంలో ప్రదర్శించిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వర్గల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వర్గల్‌లో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదివారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద ప్రజలకు సామాజిక చైతన్యం కల్పించేందుకు విద్యార్థులు నాటక రూపంలో ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా సాంస్కృతిక నృత్యాలు, కుటుంబంలో ఆడపిల్ల, మగపిల్లను సమానంగా చూడాలనే సందేశంతో నిర్వహించిన నాటకం, యువత ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ప్రేమ పేరుతో మోసపోతున్న ఘటనలు, మద్యం తాగుడుకు బానిసై మరణించిన కుటుంబాలలో ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలపై ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ స్వప్న నూనె, ఫిజికల్ డైరెక్టర్ డా జంగం పాండు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

ములుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఒరిస్సా రాష్ట్రం నుంచి అక్రమంగా తరలిస్తున్న గోవులను సిద్దిపేట జిల్లా రాజీవ్ రహదారిపై ములుగు మండలం వంటిమామిడి వద్ద ఆదివారం బీజేపీ నాయకులు పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న ములుగు మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో గో రక్షక్ దళ్, బజరంగ్ దళ్, బీజేపీ కార్యకర్తలు వంటిమామిడి వద్ద అడ్డుకున్నారు. ఒరిస్సా రాష్ట్రం నుంచి వస్తున్న ఈ కంటైనర్‌లో 150 గోవులను ఉండగా వాటిని అక్రమంగా హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. గోవుల కంటైనర్‌ను ములుగు పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. అక్కడి నుంచి ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్, బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం చల్లూరు గోశాలకు తరలించారు.


గోవుల కంటైనర్ వాహనంతో బీజేపీ కార్యకర్తలు

ఫైనాన్స్ వేధింపులకు యువకుడు బలి

నంగునూరు, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ మైక్రో ఫైనాన్స్‌వారి వేధింపులను తట్టుకోలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం రాత్రి సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని బద్దిపడగలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన అవేటి వినోద్ కుమార్ (28) ఆరు నెలల కిందట సిద్దిపేటలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్‌లో రూ.4.50 లక్షల రుణం తీసుకుని డోజర్ ట్రాక్టర్ కొనుగోలు చేశాడు. ట్రాక్టర్ సరిగా నడవకపోవడంతో నెలవారీ కిస్తీలు సకాలంలో కట్టలేకపోయాడు. ఈఎంఐలు సకాలంలో చెల్లించడం లేదంటూ ఫైనాన్స్‌వారు ఒత్తిడి పెంచారు. వారి వేధింపులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురైన వినోద్‌కుమార్ శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య రేఖ, కూతురు కీర్తన, కుమారుడు అక్షిత ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాజగోపాల్ పేట ఎస్ఐ వివేక్ తెలిపారు.


వినోద్ కుమార్ (ఫైల్)

ఆటో కిస్తీలు కట్టలేక ఆటో డ్రైవర్..

వెల్దుర్తి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు, ఆటో కిస్తీలు కట్టలేక మనస్తాపానికి గురైన ఓ యువకుడు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన వెల్దుర్తిలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... వెల్దుర్తి పట్టణానికి చెందిన మేడ్చల్ నాగరాజు (33) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా ఆటో సరిగా నడవకపోవడంతో దానిపై ఉన్న కిస్తీలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో బాధపడ్డాడు. ఈ క్రమంలోనే మనస్తాపానికి గురై శనివారం సాయంత్రం వెల్దుర్తిలోని తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఉరివేసుకుంటున్నట్లు తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే పొలం వద్దకు వెళ్లిన కుటుంబ సభ్యులు నాగరాజు చెట్టుకు ఉరివేసుకుని ఉండడం చూశారు. వెంటనే 108 వాహనంలో చికిత్స నిమిత్తం తూప్రాన్ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే నాగరాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య సంగీత, ముగ్గురు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎన్సాన్‌పల్లి గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 19(ఆంధ్రజ్యోతి):సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. గౌడ సంఘం అధ్యక్షుడిగా అంబటిస్వామి గౌడ్, డైరెక్టర్లుగా గాదగోని రాజేశం గౌడ్, గౌరీ బాలాగౌడ్, అంబటి నర్సింలు గౌడ్, బొలగం సత్తయ్య గౌడ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సన్మానించారు.

ఉపాధ్యాయులకు బోధనేతర పనుల అప్పగింత సరికాదు

● టీఎస్‌యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పిల్లి రాజు

చేర్యాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల తనిఖీ పేరిట ప్రభుత్వ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించడం వంటి చర్యలతో విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని టీఎస్ యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి పిల్లి రాజు పేర్కొన్నారు. ఆదివారం చేర్యాల మండల కేంద్రంలో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బడికి దూరమై బోధనేతర పనుల్లో నిమగ్నమైతే విద్యార్థులబోధనపై ప్రభావం చూపుతుందన్నారు. ప్రభుత్వం పునరాలోచించి పర్యవేక్షణా టీంలను రద్దుచేయాలని కోరారు.

దీక్షాదక్షతలు యువతకు స్ఫూర్తి కావాలి


అఖిల్‌రెడ్డిని సత్కరిస్తున్న నందిని సిధారెడ్డి, ఉద్యోగులు

కొండపాక, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): లక్ష్యానికి తగినట్లు ప్రణాళిక, పట్టుదలతో సాధించిన విజయాలు యువత స్ఫూర్తిగా తీసుకోవాలని విశ్రాంత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. బాల నరసయ్య పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్ వన్ ఉద్యోగ నియామకాల్లో డీఎస్పీ ఉద్యోగానికి ఎంపికైన నర్రా అఖిల్ రెడ్డి అభినందన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.మండలంలోని బందారం గ్రామంలో మనం.. మన ఊరు.. ఉద్యోగులు కార్యదర్శి రాజిరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏదీ దానంతటదే మన దరిచేరదనీ అఖిల్ లా కష్టించి సాధించాలన్నారు. ప్రముఖ కవి నందిని సిధారెడ్డి మాట్లాడుతూ పోలీసు ఉద్యోగం కత్తిమీద సాము లాంటిదన్నారు. అఖిల్ విధినిర్వహణలో మంచి పోలీసు అధికారిగా నిలవాల్సి ఉందన్నారు. సమావేశంలో అఖిల్‌రెడ్డికి శాలువా, మెమొంటోలతో సత్కారం చేశారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, రాజాగౌడ్, రాజిరెడ్డి, మల్లారెడ్డి ,దేవేందర్ రెడ్డి,వెంకట్ రెడ్డి, తుకారాం, పోషాద్రి, అఖిల్ రెడ్డి, ఎల్లారెడ్డి, భగవాన్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగించారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్/గజ్వేల్/వర్గల్/కుకునూరుపల్లి/నంగునూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గంలో ఇటీవల మృతి చెందినవారి కుటుంబాలను మాజీ మంత్రి హరీశ్‌రావు ఆదివారం పరామర్శించారు. ఇంటి నిర్మాణం కోసం ఫైనాన్స్‌లో లోన్ తీసుకుని వేధింపులు తట్టుకోలేక సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు మల్లేశం ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఆదివారం మాజీ మంత్రి హరీశ్‌రావు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ ద్వారా రూ. 5వేలతో పాటు తన వ్యక్తిగతంగా రూ.10 వేల తక్షణ సహాయాన్ని అందించారు. అదేవిధంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ భూనిర్వాసిత కాలనీలోని ఏటిగడ్డ కిష్టాపూర్ మాజీ సర్పంచ్ దామరంచ ప్రతాప్ రెడ్డి తల్లి అంజమ్మ, లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కొలిచెల్మె మల్లయ్య ఇటీవల మృతి చెందారు. వర్గల్ మాజీ ఎంపీపీ జాలిగామ లత తండ్రి జాలిగామ నర్సాగౌడ్, వైస్ ఎంపీపీ కడపల బాల్‌రెడ్డి తండ్రి కడపల పెంటారెడ్డి సైతం ఇటీవలే మృతి చెందారు. కుకునూరుపల్లి బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మల్ల ఐలయ్య కూతురు మేఘన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ 2 రోజుల క్రితం మృతి చెందింది. ఈ మేరకు హరీశ్‌రావు మృతి చెందినవారి ఇళ్లకు వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ యాదవరెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు. ఇటీవల హుస్నాబాద్ మండలం జిల్లెల్లగడ్డ గురుకులంలో అనుమానస్పదంగా మృతి చెందిన విద్యార్థి వివేక్ మరణంపై వెంటనే విచారణ చేపట్టాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి నంగునూరులోని విద్యార్థి తల్లిదండ్రులను పరామర్శించి మాట్లాడారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్యతో ఫోన్ మాట్లాడి విచారణ చేపట్టి బాధ్యుల పై చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘటనపై ఇంత వరకు విచారణ చేపట్టకపోవడం శోచనీయమని కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వివేక్ కుటుంబంలో కుటుంబంలో ఎవరికైనా ప్రభుత్వం ద్వారా ఉపాధి కల్పించాలని కోరారు. అతని కుటుంబానికి ఎక్స్ గ్రేషియా ఇచ్చి అదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థి వివేక్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసి అండగ ఉంటానని భరోసానిచ్చారు. మగ్దూంపూర్ మాజీ సర్పంచ్ చక్రపాణి తల్లి అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించారు.


గౌరారంలో మాజీ వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

పనులను వేగవంతం చేయాలి

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య


భూంపల్లిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న బక్కి వెంకటయ్య

మిరుదొడ్డి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. ఆదివారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లిలో పీహెచ్‌సీ ప్రహరీ, మురికికాల్వల పనుల నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామంలో నిర్వహిస్తున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని కోరారు. వెంట గ్రామస్థులు జన్నారెడ్డి, శ్రీనివాస్, జనార్ధన్, రమేష్, శ్రీకాంత్ తదితరులున్నారు.

పొదుపుతో భరోసా

నంగునూరు అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) పొదుపు ద్వారా ఆర్థికాభివృద్ధితో పాటు కుటుంబానికి భరోసా లభిస్తుందని పురుషుల పొదుపు సంఘం సమితి అధ్యక్షుడు కడారి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. నంగునూరు పురుషుల పొదుపు సంఘంలో సభ్యుడైన జంగిటి నరసింహులు మృతిచెందగా అతడి కుటుంబానికి పొదుపు సంఘంలో మొత్తం రూ.80వేలు మంజూరైనట్లు తెలిపారు. అతడి పొదుపు బోనస్ అభయ నిధి రూ.8,635తో కలిపి రూ.88,635 నామిని అయిన మృతుడి భార్య బాల్‌లక్ష్మికి తిరుపతిరెడ్డి ఆదివారం అందజేశారు.

ఆ కాంటాలకు స్టాంపింగ్ ఉన్నట్టా లేనట్టా.. !

మద్దూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దూళిమిట్ట మండలం బైరాన్‌పల్లి గ్రామంలోని రైతు వేదికలో వృథాగా పడి ఉన్న కాంటాలను పట్టించుకునే వారే కరువయ్యారు. ఈ కాంటాలకు స్టాంపింగ్ ఉన్నట్టా.. లేనట్టా అనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. రైతులు వరి పంటను కోస్తూ రైతువేదిక వద్ద ఏర్పాటు చేయబోయే కొనుగోలు సెంటర్ వద్ద ధాన్యాన్ని ఆరబోసుకుంటున్నారు. జిల్లా అధికారులు ముందస్తుగానే కాంటాలను తనిఖీ చేస్తూ స్టాంపింగ్ వేస్తున్న క్రమంలో బైరాన్‌పల్లిలోని రైతు వేదికలోని ఓ గదిలో వృథాగా పడిఉన్న కాంటాలకు మోక్షం లభించేనా అనే సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. అక్కడక్కడా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న తరుణంలో రైతుల ధాన్యం తూకాల్లో ఎలాంటి మోసాలకు తావు లేకుండా స్టాంపింగ్ వేస్తున్నట్లు చెబుతున్నా ఇక్కడ అలాంటిదేమీ కన్పించకపోవడం గమనార్హం. స్థానిక ఐకేపీ నిర్వాహకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో విఫలమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా స్థానిక ఐకేపీ సెంటర్ నిర్వాహకులు కాంటాలకు స్టాంపింగ్ వేయించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా దేవదాసు

గజ్వేల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడిగా గజ్వేల్ పట్టణానికి చెందిన బొల్లిబోత్తుల దేవదాసు ఎన్నికయ్యారు. పద్మశాలీ సంఘం భవనంలో ఆదివారం నిర్వహించిన పోలింగ్‌లో అధ్యక్షుడిగా బొల్లిబొత్తుల దేవదాసు, ప్రధాన కార్యదర్శిగా గాడిపల్లి ఎల్లంరాజు, ఉపాధ్యక్షుడిగా కోట కిషోర్, కోశాధికారిగా హనుమాన్‌దాసు, సహాయకార్యదర్శిగా పాశికంటి శ్రీనివాస్‌లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తలకొక్కుల రాజు తెలిపారు. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు తలకొక్కుల రాజు, గుండు కాశీప్రసాద్ ధ్రువీకరణ పత్రాలను అందజేసి, సన్మానించారు. అనంతరం బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుని, పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

రోల్‌మోడల్‌గా ఎదగాలి : కలెక్టర్

సిద్ధిపేట కల్చరల్/గజ్వేల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరికీ రోల్‌మోడల్‌గా ఉండాలని బాలసదనంలోని పిల్లలకు కలెక్టర్ హైమావతి సూచించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాలసదనంలో పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేశారు. గజ్వేల్ మండల పరిధిలోని అహ్మదీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం సాయంత్రం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్, ఓపీ రిజిస్టర్‌లో మెడికల్ ఆఫీసర్ ప్రణయ్‌రాజ్ సంతకాల్లో తేడా ఉండడాన్ని గుర్తించిన కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.



వెలుగుల సవ్వడి

- టపాసులు, పూజాసామగ్రి కొనుగోలు

సిద్దిపేటకల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వెలుగుల పండుగ దీపావళి సందడితో పట్టణం కోలాహలంగా మారింది. పట్టణంలోని పలుచోట్ల ఏర్పాటు చేసిన టపాసుల షాపుల్లో అమ్మకాలతో సందడి నెలకొన్నది. అలాగే ధనలక్ష్మి పూజకు అవసరమయ్యే పూలను, పూజా సామగ్రిని కొనుగోలు చేశారు. వ్యాపార వాణిజ్య సముదాయాల్లో లక్ష్మీపూజ చేయడానికి పూజా సామగ్రితో పాటుగా సాయంత్రం షాపుల ముందు కాల్చడానికి టపాకాసులు కొనే పనిలో పడ్డారు. దీంతో రోడ్లు రద్దీగా మారాయి.



గంగాపూర్ శివారులో సద్ది తింటున్న రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

విద్యుత్ సరఫరా నిలిపివేయవద్దు

- అధికారులకు మాజీ మంత్రి హరీశ్ సూచన
- సద్ది తింటున్న రైతులతో ముచ్చట్లు

వర్గల్/చిన్నకోడూరు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్గల్ మండలంలో పరిశ్రమల కోసం టీజీఐఐసీ సేకరించిన భూముల్లో నిర్మాణాలు జరగకపోవడంతో వర్గల్, అవుసులోనిపల్లి, నగరం తండా గ్రామాల రైతులు పంటలను సాగు చేస్తున్నారు. నెలరోజుల్లో పంటలు చేతికొస్తాయని అప్పటి వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయవద్దని మాజీమంత్రి హరీశ్‌రావు విద్యుత్ అధికారులకు సూచించారు. రైతుల విజ్ఞప్తి మేరకు ఆయన ఫోన్‌లో అధికారులతో మాట్లాడారు.

రైతులతో మాటామంతి

చిన్నకోడూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పర్యటించారు. గంగాపూర్ శివారులో పొలాల వద్ద మధ్యాహ్నం సద్ది తింటున్న రైతులతో కాసేపు ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు రైతులను ఏయే ఏయే పంటలు సాగు చేస్తున్నారని ఆరా తీసి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. యూరియా బస్తాల కోసం చాలా ఇబ్బందులు పడ్డామని, ఎకరాకు ఒక యూరియా బస్తా మాత్రమే ఇస్తామని పలు నిబంధనలు పెట్టారని రైతులు మాజీ మంత్రికి తెలిపారు. వ్యవసాయ బావుల వద్ద కరెంట్ కోతలు ఉంటున్నాయని రైతులు మాజీ మంత్రికి చెప్పారు. అంతకు ముందు గంగాపూర్‌లో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తండ్రి ఎర్రోళ్ల విజ్జయ్య దశదిన కర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. అనంతరం ఎల్లాయిపల్లి మాజీసర్పంచ్ అవుదుర్తి మహేందర్ తండ్రి నర్సయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తాం: బీఆర్ఎస్

బెజ్జంకి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మానకొండూరు మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఫామ్‌హౌస్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయకపోతే కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. గుండారం గ్రామంలోని రసమయి ఫామ్ హౌస్ పై కాంగ్రెస్ నాయకుల దాడిని నిరసిస్తూ ఆదివారం బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు బెజ్జంకిలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తమ నాయకులు కార్యకర్తలతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే రసమయి నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రశ్నిస్తే దాడులు చేయడమేంటని ప్రశ్నించారు. ప్రజా క్షేత్రంలో అభివృద్ధిపై చర్చించేందుకు ఎమ్మెల్యే సిద్ధమా అని సవాల్ విసిరారు. రసమయి ఇంటిపై దాడి చేసిన వారిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ



చేర్యాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారి పక్కన చేర్యాల మండలం గుర్జకుంట గ్రామశివారు కొమురవెల్లి కమాన్ క్రాస్‌రోడ్డుకు చేరువలోమిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ కారణంగా తాగునీరు వృథాగా ప్రవహించింది. చాలాసేపటి వరకు పైకి ఎగజిమ్ముతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో సమీప ప్రదేశమంతా చిత్తడిమయమైంది. దీంతో ప్రయాణికులు నానా తంటాలుపడ్డారు. ఆలస్యంగా తేరుకున్న సంబంధిత సిబ్బంది నీటిసరఫరా నిలిపివేశారు.

PUBLIC NOTICE

The General public is hereby informed that our clinet Shriram Finance Limited Gajwel Branch, Siddipet Dist is dealing with financing business in the course of business Sri. Dasari Potta Venkati alias Dasari Venkati, S/o. Dasari Ramulu, approached our client for finance and accepted to deposit his title deeds in respct of his property i.e., All that the house bearing No.7-177, admeasuring 90 Sq.yards, Situated at Gajwel Village, Gajwel Revenue Mandal, Siddipet District, under Gajwel Pregnapur Municipality and Bounded as follows:- **NORTH**: Plot of M.Mariyamma, **SOUTH**: Road **EAST**: Plot of Pendam Babu, **WEST**: House of M.Mariymma

towards security for the loan availed by him. If any person or persons having any claim, right, title or interest in the above said property may approach the undersigned within 7 days from the date of this publication or else our clinet will proceed with the transaction.

Sd/- S.SRINIVAS RAO, Advocate
H.No.2-19-79/A/10/A, Balaji Enclave Extn, East Kalyanpur, Uppal, Hyderabad.
Cell: 9948104019

బహిరంగ ప్రకటన

సం/- తునికి శ్రీనివాస్ రెడ్డి, అడ్వకేట్
ఇ.నెం. 2-10-118,
కరీంనగర్, సెల్ : 9440070078

బహిరంగ ప్రకటన

సం/- తునికి శ్రీనివాస్ రెడ్డి, అడ్వకేట్
ఇ.నెం. 2-10-118,
కరీంనగర్, సెల్ : 9440070078

మల్లన్న ఆలయంలో కార్తీక పూజలు

కొమురవెల్లి: కొమురవెల్లి మల్లన్న ఆలయంలో ఈ నెల 22 నుంచి నెల రోజుల పాటు కార్తీకమాసం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈవో వెంకటేష్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

మిత్రుడి కుటుంబానికి అండగా..

బెజ్జంకి: తోటి మిత్రుడు అనారోగ్యంతో మృతి చెందగా అతడి కుటుంబానికి స్నేహితులు అండగా నిలిచారు. మండలంలోని కల్లేపల్లి గ్రామానికి చెందిన దొంతి శ్రీకాంత్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు.ఎస్సెస్సీ 2000-01 బ్యాచ్ స్నేహితులు తలా కొంత జమచేసి రూ.50వేలు మృతుడి కుటుంబానికి అందజేశారు.